చకచకా రైల్వే బ్రిడ్జి పనులు

రైలు వెళ్లే సమయంలో గేటు వేయడంతో నిలిచిపోయిన వాహనాలు

జహీరాబాద్ పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులు

- జహీరాబాద్‌లో రూ.90 కోట్లతో నిర్మాణ పనులు
- బీఆర్ఎస్ హయాంలోనే 90 శాతం పూర్తి
- కొత్త ఏడాదిలో అందుబాటులోకి రానున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి
- తీరనున్న వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు

జహీరాబాద్, నవంబర్ 30: జహీరాబాద్ మీదుగా రాకపోకలు సాగించే వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు కొత్త ఏడాదిలో దూరం కానున్నాయి. ఏండ్లుగా నత్తనడకన సాగిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు వేగవంతం చేశారు. హైదరాబాద్-ముంబయి మార్గాలకు వెళ్లే 65వ జాతీయ రహదారి జహీరాబాద్ పట్టణం గుండా వెళ్తుండడంతో పరిసర గ్రామాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన ప్రజలు, వాహనదారులు ఈ రోడ్డు మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో రైలు వెళ్లిన ప్రతి సారి గేటు వేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక గూడ్స్ రైలు వెళ్తే వాహనదారులకు చుక్కలే.. ఈ బ్రిడ్జి పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

పనులు ఏ దశలో ఉన్నాయంటే..

రైల్వే బ్రిడ్జి పనులకు సంబంధించి ఈద్గా సమీపంలో బీదర్ చౌరస్తా వరకు దాదాపు కిలోమీటరకు పైగా సీసీ రోడ్లు, వంతెనల విస్తీర్ణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రైల్వే గేటు సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు పూర్తికాగా రెండు వైపులా రహదారి అనుసంధాన ప్రక్రియ పనులు చేపడుతున్నారు. వంతెనకు ఇరువైపులా సర్వీసు రోడ్డులో జహీరాబాద్ వైపు పూర్తయింది. ఈద్గా నుంచి మొగుడంపల్లి చౌరస్తా వరకు సర్వీసు రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ పనులు చేపట్టేందుకు సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు జహీరాబాద్ పట్టణానికి వచ్చే మార్గాన్ని నెల రోజుల పాటు మూసివేశారు. ఏది ఏమైనా కొత్త ఏడాదిలో రైల్వే బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ట్రాఫికర్'కు చెక్ పెట్టేందుకు..!

జహీరాబాద్ పట్టణంలో ట్రాఫిక్‌ను కట్టడి చేసేందుకు రైల్వే గేటు వద్ద బ్రిడ్జి నిర్మించాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మంత్రిగా ఉన్న తన్నీరు హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.90 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ అప్పట్లో రైల్వే బ్రిడ్జి, సీసీ రోడ్లు తదితర పనులను వేగవంగా చేపట్టారు. ఆ తర్వాత బిల్లులు సకాలంలో రాకపోవడంతో పనులు నత్తనడకన సాగాయి. పలుమార్లు సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చినా పనులు ముందుకు సాగలేదు. దీంతో ట్రాఫిక్ కష్టాలు యధావిధిగా ఉండడంతో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బిల్లులు మంజూరు చేయించారు. దీంతో కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు.

భారతీయ కిషన్ సంఘ్‌పరిషత్ సదస్సులో పాల్గొన్న గుమ్మడిదల రైతు సమాఖ్య నాయకులు

ప్రతిపంటకూ లాభసాటి ధర ప్రకటించాలి

గుమ్మడిదల, నవంబర్ 30: హైదరాబాద్‌లో జరిగిన భారతీయ కిషాన్ సంఘ్ పరిషత్ సమావేశంలో గుమ్మడిదల మండల రైతులు పాల్గొన్నట్లు పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు నాయకులు మద్దుల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో జాతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు దాదాబాయి(గుజరాత్), జాతీయ కన్వీనర్ చంగల్‌రెడ్డి, తెలంగాణ కిషన్ సంఘ్ అధ్యక్షుడు సోమశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ సదస్సులో రైతు సంఘం నాయకులు మాట్లాడారు. ఇందులో జాతీయ స్థాయిలో రైతులు పండించిన ప్రతి పంటను లాభసాటి ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని తీర్మానించినట్లు పీఏసీఎస్ చైర్మన్ తెలిపారు. రైతు పండించిన పంటలను అంతర్జాతీయ స్థాయిలో విక్రయించేందుకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ తీర్మానించినట్లు పేర్కొన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ అసోసియేషన్‌లో ప్రతి రాష్ట్రం నుంచి 50 వేల మంది రైతులకు సభ్యత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో రైతులకు కేంద్రప్రభుత్వం అండగా నిలిచి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులు పండించిన పంటకు లాభసాటి ధరలు ప్రకటించాలని జాతీయ స్థాయిలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు మద్దుల బాల్‌రెడ్డి, బుచ్చగారి బాల్‌రెడ్డి, చంది అంజిరెడ్డి, సిద్దిపేట రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లవాగు కింద 4079 ఎకరాలకు తైబంది

సిర్గాపూర్, నవంబర్ 30: నల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో యాసంగి సాగుకు మొత్తం 4079 ఎకరాలకు సాగు నీళ్ల విడుదల చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆధ్వర్యంలో గత శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన అధికారుల సమావేశంలో నిర్ణయించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఐబీ అధికారులు ఏసయ్య, సుందర్, పవన్‌కుమార్, ఖేడ్ ఆర్డీవో అకోశ చక్రవర్తి ఇందులో పాల్గొన్నారు. ప్రాజెక్టు పరిధి ఆయకట్టు మొత్తం 6200 ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్, జిల్లా నీటి పారుదల అధికారులకు విన్నవించినా 4079 ఎకరాలకు కుదించడంపై కల్వేర్ మండలంలోని ఇందిరా నగర్ ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రాజెక్టు ప్రస్తుతం పూర్తి స్థాయి నీటి మట్టంతో ఉందని, చివరి ఆయకట్టు వరకు సాగు నీళ్లు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, రైతులు డిమాండ్ చేశారు.

క్రీడా పోటీల్లో పాలుపంచుకోవాలి

కలెక్టర్ వల్లూరి క్రాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 30: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సీఎం కప్ క్రీడా పోటీలపై మండల ప్రత్యేకాధికారులు, వివిధ స్పోర్ట్స్ కమిటీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో సీఎం కప్ పోటీలు, డిసెంబర్ 10 నుంచి 12 వరకు మండల స్థాయి, 16 నుంచి 21 తేదీ వరకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, మహిళా ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో పద్మజారాణి, జిల్లా యువజన, క్రీడా శాఖాధికారి ఖాసీంబేగ్ పాల్గొన్నారు.

కెనెరా బ్యాంకు ప్రారంభం

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 30: కెనరా బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను శనివారం పోతిరెడ్డిపల్లిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె బ్యాంకు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు ఎంఎస్ఎంఈ, ఉపాధి వంటి అన్ని రకాల ప్రాధాన్య రంగాలకు రుణాలు ఇవ్వాలని కోరారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా ఖాతాదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కుటుంబ సర్వే

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 30: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే శనివారంతో ముగిసిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేలో ఇప్పటివరకు వివరాలు నమోదు కాని కుటుంబాలు టోల్ ఫ్రీ నంబర్ 08455-276155కు ఫోన్ చేస్తే సర్వే సిబ్బంది వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాకని కోరారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హత్నూర, నవంబర్ 30: మండల కేంద్రమైన హత్నూర డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాలలో పలు ఖాళీలకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ శనివారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టులు ఖాళీలు ఉన్నందున ఆయా సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం కళాశాలలో నిర్వహించే డెమోకు హాజరుకావాలని కోరారు.

ప్రతి ఉద్యోగికి విరమణ సహజమే..

గిర్ధావర్ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఆర్ఐ శ్రీనివాస్

రాయికోడ్, నవంబర్ 30: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం రాయికోడ్ ఐకేపీ కార్యాలయంలో ఆర్ఐ ప్రభాకర్ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. చేసిన మంచి పనులే గుర్తింపునిస్తాయన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ మాల్లికార్జున్‌పాటిల్, కాంగ్రెస్ మండల మైనార్టీ నాయకుడు మక్బుల్, మండల ప్రత్యేకాధికారి జగదీశ్, ఎంపీడీవో ఎంఎం షరీఫ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్హేర్, నవంబర్ 30: కల్హేర్ మండలం ఖానాపూర్ కే గ్రామానికి చెందిన కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ ఉప్పరి బాలకిష్టయ్య సాగర్ పార్థివ దేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు మహారెడ్డి రోషన్ రెడ్డి పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు అలీ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అంజయ్యసాగర్, ప్రశాంత్‌సాగర్ పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి యువతి మృతి

స్నేహలత (ఫైల్)

సిర్గాపూర్, నవంబర్ 30: వారం రోజులుగా మృత్యువుతో పోరాడి యువతి మృతిచెందింది. మండలంలోని వాసర్ గ్రామానికి చెందిన మీనా బాయి, హన్మంత్‌రావు కూతురు స్నేహలత(18) ఈ నెల 22న జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడింది. దాదాపు 60 శాతం శరీరం కాలిపోగా వెంటనే హైదరాబాద్ వెల్‌నెస్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ ఘటనపై సిర్గాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శనివారం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం అంత్యక్రియలకు యువతి స్వగ్రామం వాసర్‌కు తరలించారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

జహీరాబాద్, నవంబర్ 30: హైదరాబాద్ పట్టణంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని జహీరాబాద్ డివిజన్ మాల మహానాడు సంఘం ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్ కోరారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన మాల మహానాడు సంఘం నాయకులు, సభ్యులు, మాలలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు వ్యాసరచన పోటీలు

బొల్లారం, నవంబర్ 30: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంఈఓ కుమారస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 'పునరుద్ధరించే ఇంధన వనరుల వినియోగం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 30: యువత మత్తు పదార్థాలను వినియోగిస్తూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తారా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ నియంత్రణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ అనురాధ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జోత్స్న, డాక్టర్ సదయ్య కుమార్, పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

రామచంద్రాపురం, నవంబర్ 30: ఆర్సీపురం డివిజన్‌లోని మయూరి నగర్‌లోని గీతాభూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ బృందం డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డీఎస్పీలు సుబ్బరాయుడురెడ్డి, హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, గోపి విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం ద్వారా జరుగుతున్న నష్టాలు, యువత చెడుదారి పడుతున్న విషయాలను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ వాడమని ఎవరైనా ప్రేరేపించినా వెంటనే 1908టోల్ ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శశికాంత్‌రెడ్డి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల వద్ద వీధి దీపాల ఏర్పాటు

నిజాంపేట్, నవంబర్ 30: వారం క్రితం మండల పరిధిలోని బాచేపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల కోరికమేరకు పాఠశాలకు వెళ్లే దారిలో వీధి దీపాలు లేకపోవడంతో శనివారం ఎమ్మెల్యే ఆదేశాలతో బాచేపల్లి యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముదిరాజ్ శ్రీకాంత్, లైన్‌మెన్ కిషన్ నాయక్, జనార్దన్ స్తంభాలు వేయించి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

లీఫార్మా, గ్రాన్యువల్స్ పరిశ్రమలకు జరిమానా

బొల్లారం, నవంబర్ 30: పర్యావరణానికి, ప్రజారోగ్యానికి విఘాతం కలిగిస్తున్న రెండు పరిశ్రమలపై పీసీబీ చర్యలకు దిగింది. నిబంధనలు పాటించకుండా కాలుష్యం విడుదల చేస్తున్న లీఫార్మా, గ్రాన్యువల్స్ పరిశ్రమలపై పీసీబీ సభ్యుడు సెక్రెటరీ రవి జరిమానా విధించినట్లు పీసీబీ ఈఈ కుమార్ పాఠక్ శనివారం ప్రకటనలో తెలిపారు. గడ్డపోతారం గ్రామస్తులు గతంలో పరిశ్రమల నిర్వాకంపై ఆందోళన వ్యక్తం చేస్తూ పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వర్షాల మాటున పరిశ్రమ పైపుల నుంచి బహిరంగ ప్రదేశాల్లో రసాయన వ్యర్థ జలాల విడుదలతో పర్యావరణంతోపాటు స్థానిక ప్రజల ఆరోగ్యాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నారని, అందిన ఫిర్యాదుల మేరకు రెండు పరిశ్రమలపై విచారణ జరిపిన అధికారులు చర్యలు చేపట్టారు. లీఫార్మా పరిశ్రమకు రూ.8లక్షలు, రూ.24 లక్షలు బ్యాంకు గ్యారెంటీ, గ్రాన్యువల్స్ పరిశ్రమకు రూ.8 లక్షల జరిమానా, రూ.24 లక్షల బ్యాంకు గ్యారెంటీలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భక్తిశ్రద్ధలతో మహా చందన లేపనం

విరాశం అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, నవంబర్ 30: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డిలలితాదంపతులు మహా చందనలేపనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలుచేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి గతంలో ఇస్తానన్న హామీ మేరకు రూ. రెండు లక్షల నూటపదహార్లు అందజేశారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలోని ఏడో వార్డులో నింబోజి శ్రీకాంత్‌చారి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఎవరికి ఎలాంటి కష్టమొచ్చినా అండగా నిలుస్తానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకరావడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, సూర్యనారాయణ, నాయకులు రమణారెడ్డి, సుధాకర్, అంజనేయులుయాదవ్, బీరప్ప, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్నాం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, నవంబర్ 30: క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ మండే మార్కెట్‌లో పండు టీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీజన్ - 8 రాష్ట్రస్థాయి మ్యాట్ కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రెండు రోజులపాటు జరుగుతున్న ఈ పోటీల్లో 60 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహాగౌడ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ దేవానంద్, జాతీయ కబడ్డీ క్రీడాకారులు శ్రీనివాస్‌రెడ్డి, కబడ్డీ సంఘం ప్రతినిధి ఎల్లయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటికి కొరత లేకుండా చూడాలి

ఎంపీ రఘునందన్‌రావు

బొల్లారం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

బొల్లారం, నవంబర్ 30: మున్సిపాలిటీ పరిధిలో తాగు నీటికి కొరత లేకుండా చూడాలని ఎంపీ రఘునందన్ అన్నారు. బొల్లారం మున్సిపల్ సమావేశం చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మున్సిపల్ తాత్కాలిక కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎంపీ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 75 హైమాస్ట్ లైట్లు ఉన్నా 50 కూడా పని చేయడంలేదని, వారంలోగా అన్ని లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న 2,500 నల్లాలకు డిసెంబర్ 2లోగా కనెక్షన్లు ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు హెచ్ఎండీఏ అధికారులతో మాట్లాడి ఐదెకరాలు కేటాయించేలా చూడాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో 30 పడకల దవాఖాన, ఈఎస్ఐ దవాఖాన, ఎన్సిచ్ ఏరియా సర్వే నంబర్ 81లో ఎకరం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, పారిశ్రామికవాడలో ఫైర్ స్టేషన్, జనాభా ప్రాతిపదిక అంగన్వాడీ కేంద్రాల మంజూరుకు తీర్మానాలు చేసి ప్రతిపాదనలు చేస్తామని, వాటిని మంజూరు చేసేలా చూడాలని ఎంపీని కోరారు. సమావేశంలో రూ.75 లక్షలతో తాగునీరు, పారిశుద్ధ్యం, వాహనాల నిర్వహణ, మరమ్మతులు, పలు అభివృద్ధి పనులపై సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, మేనేజర్ మల్లికార్జున్, సీఐ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ కేటాయించాలని ఆందోళన

సిర్గాపూర్ పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామ ప్రజలు

సిర్గాపూర్, నవంబర్ 30: మండల కేంద్రమైన సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట శనివారం ప్రజలు ఆందోళనకు దిగారు. స్థానికంగా 108 అంబులెన్స్ వాహనాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిర్గాపూర్ మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి ఒక 108 కేటాయిస్తున్నట్లు ప్రకటించి, ఇక్కడ రావాల్సిన అంబులెన్స్‌ను మరో మండలానికి తరలించడంపై అసహనం వ్యక్తం చేశారు. సిర్గాపూర్‌కు చుట్టూ 20- 24 కిలోమీటర్ల దూరం దాక అత్యవసర సేవల వాహనాలు లేవని, చాలా గిరిజన తండాలు ఉన్నాయని, తప్పనిసరిగా సిర్గాపూర్‌కు 108 అంబులెన్స్ అవసరమని పేర్కొన్నారు. సత్వరమే వాహనాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మెరుగైన సేవలందించినప్పుడే గుర్తింపు

సివిల్ సర్వీసెస్ అధికారులతో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 30: ప్రజలకు మెరుగైన సేవలందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని సివిల్ సర్వీసెస్ అధికారులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఎంసీహెచ్ఆర్‌డీ ద్వారా జిల్లాకు వచ్చిన 30 మంది శిక్షణ సివిల్ సర్వీసెస్ అధికారులకు శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేక వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటనల అనుభవాలను అర్థం చేసుకోవడం, వాటి ద్వారా జిల్లాలో అవసరమైన మార్పులు ఆవిష్కరించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించే అవకాశం దక్కుతుందన్నారు. శిక్షణ కాలంలో పొందిన అనుభవాలను సివిల్ సర్వీసెస్ అధికారులు ఈ సందర్భంగా పంచుకున్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు

బొల్లారం, నవంబర్ 30: జిన్నారం మండల కేంద్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలిసిన రంగరాముల స్వామి గుట్టపై శనివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. కోదండ రామాలయ అర్చకుడు లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో పలు జంటలు సత్యనారాయణ స్వామి వ్రతం, అష్టలక్ష్మి పూజాది క్రతువులను భక్తిశ్రద్ధలతో జరిపించారు. ప్రతి ఏడాది కార్తిక మాసం పురస్కరించుకొని గణపతి పూజ, గౌరీ పూజ, శ్రీరామ సమేత సత్యనారాయణ స్వామి వ్రత పూజలు వేదమంత్రోచ్ఛారణల మధ్య కనుల పండువగా జరిగింది. సుమారు 20 మంది జంటలు పూజల్లో పాల్గొన్నాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

అందోల్‌లో విద్యార్థులతో కలిసి బండ్‌లో పాల్గ